# ద్వితీయ కళత్రం

'మనం ఎన్నెన్నో చేయా లనుకుంటాం—కాని చేయలేక పోతాం; అలాగే ఎన్నెన్నో శుభకార్యాలకు వెళ్ళాలనుకుంటాం—కాని ఆ సమయానికి వెళ్ళలేక పోతాం. వ్యక్తుల ప్రవర్తనలమీద పరిస్థితుల ప్రభావం నాకు తెలియనిది కాదు. కనుకనే నా పెళ్ళికి నువ్వు రాకపోయినా ఏదో బలవత్తరమైన సంఘటనో, కారణమో నిన్ను ఆ స్థితికి తెచ్చిందని తలంచి నువ్వు నా పెళ్ళికి రాని హేతువును సులభంగా క్షమించ గలిగాను.

'మిత్రమా!

'నేను మళ్ళీ వివాహం చేసుకున్నాను. కాని ద్వితీయ వివాహం మా ఊళ్లో చేసుకోలేదు; మా ఊరివాళ్లను ఎవర్నీ పిలువలేదు. అయినా మా ఊరివాళ్ళను నా పెళ్ళికి పిలవాల్సిన అగత్యం కనపడలేదు. వాళ్లు నామీద కనబర్చిన అవిశ్వాసానికి నామనస్సు అల్లాంటి పనిని చేయించలేదు.

'మళ్లీ పెళ్ళి చేసుకోకుండా ఉండా లనుకున్నాను. కాని సాధ్యమా? చనిపోయి స్వర్గాన ఉన్న ఆ ఉత్తమ ఇల్లాలిని తలుచుకుంటూ, ఆమెతో నేను గడిపిన రెండేళ్ల ప్రాయపు జీవితంలోని మధుర క్షణాల్ని తలపోస్తూ—మిగతా యవ్వనాన్ని చప్పగా ఎట్లా గడిపేది? శారీరకమైన కోర్కెలకు, యవ్వనపు పొంగువల్ల వొచ్చే నరాల తీపులకు - మనం అతీతులం కాజాలము. అటువంటప్పుడు ఆ కోర్కెల్ని, నరాల బాధల్ని తీర్చుకొనేందుకు—రాత్రుళ్లు యెరిగిన వాళ్లు ఎక్కడచూస్తారో

అన్న భయంతో, బ్రతుకు యొక్క మెతకదనం ఎక్కడ వెల్లడి అవుతుందోనన్న జాగ్రత్త కొద్దీ,—చీకటి బజార్లకు ప్రాకుతూ, సంపాదించిన ధనాన్ని జారవిడుచుకుంటూ, రోగాల్ని తగిలించుకొని హాస్పిటల్‌లోని బెడ్‌కు అప్లికేషన్ దాఖలు చేసేకంటె—నీతిగా, నిజాయితీగా, ఘనంగా ద్వితీయ వివాహం చేసికోవటం మేలు కాదూ! ఏమంటావు? కాని రమణరావ్! నేనొక్క పొరపాటు చేశాను. కాదు తెలిసే చేశాను. అది పొరపాటు ఎట్లా అవుతుంది?

'నాకు ఒకసారి వివాహం జరిగినట్టు, భార్య క్షయ జబ్బుతో చనిపోయినట్టు—ఆమెకు తెలియ నివ్వలేదు. అందుచేతనే నేను యిన్ని వందల మైళ్లదూరంగా, బంధువులకూ, ఊరివాళ్ళకూ తెలియ నివ్వకుండా గుట్టుగా, చప్పుడు లేకుండా మూడు ముళ్లూ ముచ్చటగా వెయ్యటం! ఇట్లా చేసినందుకు నీకు ఆశ్చర్యం కలిగించవచ్చు. కాని, ఆమెకు తెలియ జేయకుండా ఉండటం వల్ల మా దాంపత్యం సౌఖ్యవంతంగా సాగిపోయేందుకు ఎక్కువ అవకాశం ఉన్నదని నేను పూర్తిగా నమ్మడం జరిగింది. అదీకాక మొదటి భార్య క్షయ వ్యాధితో చనిపోయిందని తెలిస్తే, అది అసలే అంటువ్యాధి కనుక—ద్వితీయ వివాహానికి పిల్లనివ్వడానికి ఏ తల్లిదండ్రులూ సమ్మతించరు. అటువంటి భర్తను పొందేందుకు ఏ యువతీ ముందుకు అడుగు వెయ్యదు. కనుక నేను ఆ పద్ధతి అవలంబించాను. నా గురించి ఉన్న ఆ రహస్యం బయట పడకుండా జాగ్రత్తగా కాపాడుకోగల్గాను. 'ఎప్పటికైనా ఆ రహస్యం బయట పడకుండా ఉంటుందా?' అంటావా? ఫరవాలేదు. కొన్ని సంవత్సరాలు గడిచాక ఆ రహస్యం బయటపడ్డా ప్రమాదం లేదు. ప్రేమ వల్ల, అభిమానం వల్ల, అనురాగంచేత నేను భార్యగా ఆమెను పూర్తిగా వశం చేసికోగలను. ఆమె హృదయాన్ని పూర్తిగా నా ప్రక్కకు త్రిప్పుకోగలను. అప్పుడు ఆ రహస్యం తాలూకు గట్టితనం మా దాంపత్యంపైన ఎటువంటి మార్పూ తీసికొని రాబోదని చెప్పొచ్చు.

'భార్యను కాపురానికి తెచ్చుకున్నాను. దాంపత్యంలో ఆమెను సంపూర్ణంగా సంతృప్తి పరచాలని నేనూ, నాకు ఏ విధమైన లోటూ కలి

గించకుండా చేయాలని ఆమె — తాపత్రయంలో జాగ్రత్తలో జీవితాన్ని గడుపుతున్నాం. మా దాంపత్యాన్ని ఒక్కసారి నువ్వు చూసి వెళ్ళాలని నా మనవి. ఒక్కవారం రోజులపాటు సెలవుపెట్టి — మా ఊరు రావలసింది. నీ కోసం నేను ఎదురుచూస్తూ వుంటాను. నువ్వు తప్పకుండా వస్తావని నమ్ముతున్నాను. తప్పకుండా రమ్మని కూడా కోరుతున్నాను—

'ఆనందరావు'

రమణరావు ఆ ఉత్తరం తాపీగా చదువుకొని నవ్వుకున్నాడు. కాని ఆ క్షణాన ఆనందరావు దగ్గరకు వెళుదామని అనుకోలేదు. ఆ రాత్రి ఎందుకో మళ్ళీ ఆనందరావు - ద్వితీయ కళత్రం అతని మనస్సులో మెదిలారు. అంతగా తమ దాంపత్యపు శోభనుచూసి ఆశీర్వదించమని స్నేహితుడు ఆహ్వానిస్తూంటే - వెళ్ళకపోవటం ఏం బాగుంటుంది? ఆలోచించాడు రమణరావు. ఆనందరావు దగ్గరకు వెళ్ళేందుకే నిశ్చయించుకున్నాడు.

మరునాడు తాను రెండు రోజుల్లో బయలుదేరి వస్తూన్నట్టు రమణరావు - మిత్రుడు ఆనందరావుకు లేఖ వ్రాశాడు.

రెండు రోజుల్లోనే రమణరావు అయిదు రోజుల వరకు శెలవుపెట్టి- ఆనందరావు దంపతులను చూసేందుకు బయలుదేరాడు.

*　　　　*　　　　*

ట్రయిన్ ప్లాట్ ఫారం మీదకు రావడంతోనే - ఎలక్ట్రిక్ స్తంభం క్రింద ఉండి చేయెత్తాడు. ఆనందరావు సెకండు క్లాసు బోగీలో ఉన్న రమణరావును చూసి, రమణరావూ ఉషారుగా చేయి ఆడించాడు గాలిలో. పెట్టె దిగీదిగటంతోనే ఇద్దరూ ఒకళ్ళ భుజాలమీద ఒకళ్లు చేతులు వేసికొని గాఢంగా ఒకళ్ళ ముఖంలోకి ఒకళ్లు చూసుకున్నారు.

'చిక్కిపోయినట్టున్నావురా!' అన్నాడు ఆనందరావు.

'అవును. ఇటు సంసారమూ, అటు ఆఫీసువర్కూ -' అన్నాడు రమణరావు.

జట్కాలో ఇంటికి వొచ్చారు స్నేహితు లిద్దరూ. జట్కాలో వాళ్ళు ఇద్దరూ చాల సన్నిహితంగా, ఆప్యాయంగా, ఫ్రీగా మాట్లాడు కున్నారు. ఎంతమందో పాత స్నేహితుల్ని గూర్చి సంగ్రహంగా సమీ క్షించుకున్నారు.

'ద్వితీయ కళత్రంతో కాపురం ఎలాఉంది?' అన్నాడు రమణరావు.

'ఉత్తరంలో రాశానుగా! అయినా... చూడబోతున్నావుగదా! సహృదయంగల స్త్రీరా! అందానికి అందమూ ఉంది, గుణానికి గుణమూ ఉంది. .. నేను చెబితే నీకు కోతలుగా అగపడొచ్చు! చూస్తావుగా...' అన్నాడు ఆనందరావు ఆమెను గురించి ముందుగా చెప్పనక్కర్లేదన్నట్టు.

రమణరావు ఆమెను గురించి యేమీ అడగలేదు, బండిదిగేటప్పుడు కామోసు పేరు అడిగి తెలుసుకున్నాడు. ఆమె పేరు సావిత్రి.

ఆనందరావు అద్దెకు ఉండేది చిన్న డాబా. ఆ డాబా ముందు చిన్న గార్డెన్. ఆ గార్డెన్, అందులోని పూలూ, పరిశుభ్రతా, ఆడాబా ముందు భాగపు అలంకరణా – అంతా చూస్తే ఆ ఇంటి ఇల్లాలి యొక్క గొప్పతనం యిట్టే తెలిసిపోతుంది. ఆ డాబా ముందు భాగాన్ని చూసిన మొదటి క్షణంలోనే అనుకున్నాడు రమణరావు – ఆనందరావు తన భార్యను గురించి అతిగా ఏమీ చెప్పలేదని.

డాబా ముందు వరండాలో ఒక డ్రాయరూ, చుట్టూ నాలుగు ఫ్రేం కుర్చీలూ వేసి ఉన్నాయి. ఇంటిలోకి వెళ్ళే మొదటి ద్వారానికివేసి ఉన్న సిల్కు కర్టెన్ మీది ఎంబ్రాయిడరీ చూసి రమణరావు ఆమెకు కుట్టు పనిలో గల ఉన్నత స్థానాన్ని సులభంగా యెంచుకున్నాడు.

స్నేహితు లిద్దరూ ఫ్రేం కుర్చీల్లో కూర్చున్నారు. కొంచెం సేపు గడిచాక, రమణరావు ఆ డాబానీ, ఆ గార్డెన్‌నూ బహిరంగంగా మెచ్చు కున్నాక, ఆనందరావు –

'సావిత్రీ! కాఫీ పట్టుకురా!' అని కేక వేశాడు.

'ఆనందరావు ద్వితీయ కళత్రాన్ని చూడాలనే కాంక్ష రమణ రావులోనూ, తన భార్యను చూసి ఏం అభిప్రాయాన్ని వెలిబుచ్చుతాడో

నన్న ఆదుర్దా ఆనందరావులోనూ గంతులేయ సాగినయ్. అయిదు నిము షాలు గడిచాయి...

ద్వారానికి వేసి ఉన్న అందమైన సిల్కు కర్టెను తొలగించుకొని సావిత్రి అడుగుపెట్టింది. ఇద్దరూ తల ఎత్తి అటు చూశారు. పెళ్ళి చూపులకు తయారయ్యే పెళ్లికూతురులాగ తయారైంది. మామిడి చిగురు రంగు పట్టుచీరెపై, మల్లె పువ్వు తెలుపు పెద్దాపురం పట్టు జాకెట్టు ధరించింది. రాళ్ళ నెక్‌లెస్. మెడ చుట్టు నున్నటి మైదానంమీద అందమైన నీడల్ని పరుస్తూండగా, సిగ్గుయొక్క శృంగారాన్నంతా బుగ్గల్లో దాచుకుంటూ, తల యెత్తకుండా, పెదాలు కదల్చకుండా, తడబడే అడు గులతో, చేతులతో—కాఫీ కప్పుల్ని డ్రాయరుమీద పెట్టి, వెనుక ఎవరో తనిని పట్టుకొనేందుకు పరుగెత్తుకొస్తున్నారన్నట్టు సత్వరం మళ్లీ తెరలోకి జొరబడింది. సంతృప్తికరంగా నవ్వుకుంటూ ఆనందరావు రమణరావు ముఖంకేసి చూశాడు.

రమణరావు ముఖంలో కూఅంత్తుగా రంగుమారటంతో – ఆనంద రావు హృదయం రెపరెపలాడింది. ఆమె సిగ్గుచేత, కొత్తగా కాపురం చేస్తూన్న కారణంచేత, ఎన్నడూ పరాయి మగవాడికి కాఫీ అందించే అనుభవాన్ని పొందియుండక పోవడంచేత, కర్టెన్‌లో వొళ్లు దాచు కుంటే – రమణరావు ఆ కర్టెన్ కేసి దిగాలుపడి చూడడం భర్తయైన ఆనందరావుకు ఏమీ అర్థం కాలేదు. తన భార్య అపురూప లావణ్యానికి అమోఘమైన అందానికి నిశ్చేష్టుడై రమణరావు అలా చూస్తూ వుండి పోయాడని ఎట్లా అనుకోవడం ?

'కాఫీ త్రాగరా !' అన్నాడు ఆనందరావు స్నేహితుని పేక మేడల్ని పడగొట్టాలని.

'ఆఁ!' అంటూ డ్రాయరుమీద ఉన్న కాఫీ కప్పుల వంక చూశాడు రమణారావు.

'ఏమిటి ఆలోచిస్తున్నావు ?" అన్నాడు ఆనందరావు.

'ఏం లేదు ! ఆమె ఎవరు ?' అన్నాడు రమణరావు.

'రామాయణ మంతా విని ' ఫక్కున నవ్వాడు ఆనందరావు.
'నా భార్యరా! సావిత్రి!'

సావిత్రి!...సావిత్రి! ఆనందరావు ద్వితీయ కళత్రం. ఆనందరావు ఆమెను ఎట్లా పెళ్ళి చేసుకొన్నాడు?

'నీభార్య?' ఆశ్చర్యాన్ని కనబరుస్తూ అన్నాడు రమణరావు.

'అవును. ఏం?' అన్నాడు ఆనందరావు.

'ఏం లేదు ..' సర్దుకున్నాడు రమణరావు.

'ఎలా ఉంది?'

'ఏమిటి, కాఫీయా?'

'ఛస్ –'

'ఓహో! పెళ్ళికి నేను రాలేదు కదూ! ఇప్పుడు చూశానుగా. నీకు తగిన సతి, మీ దాంపత్యం...' ఎందుకో రమణరావుకు మాటలు కదలి రాలేదు. ఆ కాస్తకే పొంగి పోయాడు ఆనందరావు. పెళ్లి అయిన కొత్తలో 'నీభార్య రంభను మించిన అందకత్తెరా!' అని ఏ మిత్రుడో అంటే ఆభర్త పొందే ఆనందానికి, గర్వానికి అంతు ఉండదు. ఆ పొగడ్తే పెళ్ళి అయిన రెండు మూడు సంవత్సరాలకు ఏ స్నేహితుడైనా అంటే ఆ భర్తే అసూయ పొందుతాడు; ఆవేశపడతాడు; తన భార్యమీద ఆ మాటలు అన్న వీడు ఆమెమీద కన్ను వేసినట్టే 'ఫీల్' అవుతాడు.

రమణరావు కూర్చున్న కుర్చీ ఎదురుగ్గా ఉన్న కిటికీ తెరకొద్దిగా కదలటాన్ని అతను గమనించాడు. అందులోంచి సావిత్రి తన వంక చూస్తున్నట్టు కూడా పసికట్టాడు.

ఆనందరావునూ, అతనికి కొత్త భార్యమీద ఉన్న అపారమైన అభిమానాన్నీ, తనకి ఇదివరకే ఒక పెళ్ళి అయినట్టూ, భార్య క్షయతో చనిపోయినట్టూ, ఆ విషయాన్ని బైటికి పొక్క నివ్వకుండా సామర్థ్యంతో మోసంచేసి అందాల కాణాచియైన ద్వితీయ కళత్రాన్ని సంపాదించినట్టు అతను పొందే గర్వాన్నీ – చూస్తూన్న కొద్దీ రమణరావుకు

జాలి వేసింది. తను ఎందుకు వొచ్చాడు? తన రాకతో చిలుకా గోరు వంకల లాగా పరిగణింపబడే యీ దంపతుల మధ్య మనస్పర్థలు చెల రేగుతాయేమో! వాళ్ళ దాంపత్యంలో చిచ్చును రగిలించిన పాపం తను ఎందుకు పంచుకోవాలి? తను రాకపోనా బాగుండేది! ఇప్పుడు తను నేర్పుగా, తెలివిగా సంచరించి, ఎల్లాగో అతి త్వరితంగా అక్కణ్నుంచి బయట పడటం మేలు! సావిత్రి తనని గుర్తించే వుంటుంది...

'సావిత్రీ!' ఆనందరావు పిలిచాడు.

లోపల్నుంచి జవాబు లేదు.

'సావిత్రీ! ఇట్లారా!' ఆనందరావు గొంతుస్థాయిని ఆరున్నరలోకి పెంచాడు.

అయినా సావిత్రి రాలేదు. ఆనందరావు లోపలికి వెళ్ళాడు. సావిత్రి వొచ్చింది. రమణరావు ఆమె ముఖంకేసి చూడలేకపోయాడు.

'ఇతను నా మిత్రుడు రమణరావు' - భార్యకు పరిచయం చేశాడు. ఆమె అతని వంక చూడకుండానే నమస్కారం చేసింది బలవంతాన.

'ఈమె నా భార్య - సావిత్రి' రమణరావు ప్రతిగా నమస్కారం చేశాడు ఆమె ముఖంకేసి చూడకుండానే.

భార్యను కుర్చీలో కూర్చోబెట్టాడు ఆనందరావు. భర్త బలవంతం మీదనే ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చుంది ఆమె. తాము కులాసాగా మాట్లాడుకునే కబుర్లలో భార్యకూడా ఫ్రీగా పాల్గొనాలని ఆనందరావు అభిలాష. కాని ఆమెకూ, రమణరావుకూ మధ్యగల జ్వాల అతనికేం తెలుసు? సావిత్రి నుదురుమీద స్వేదపుబిందువులు చక్కగా ఏర్పడ్డాయి. రమణరావు ఆ వరండా పైకప్పు తాటాకు కమ్మల్ని లెక్కిస్తున్నాడు. ఈ వాతావరణంలోని వింత ఆనందరావుకు అర్థం కాలేదు. సావిత్రి - తల నొప్పితో పగిలిపోతూన్నదని కుర్చీలోంచి లేచింది. ఆనందరావు ఏమనలేదు. ఆమె కుర్చీలోంచి లేచి ఇంట్లోకి వెళ్లింది. ఆమె వెళ్ళిన త్రోవ కేసే చూడ నారంభించాడు. రమణరావు అర్థం చేసుకొనేందుకు ప్రయత్నించ నారంభించాడు.

'పాపం! తల నొప్పిగా ఉంది కాబోలు' అన్నాడు రమణరావు జాలి పడుతూన్నట్టు.

'అవును,' అన్నాడు ఆనందరావు చప్పగా.

ఆ రాత్రి భోజనాల దగ్గర కూడా వాళ్ళ ముగ్గురి మధ్య ఒక వింతైన వాతావరణ సృష్టియే జరిగింది. అన్నమూ, కూరలూ వడ్డన చేసేప్పుడు సావిత్రి ముఖంలో సంతోషం కానీ, వడ్డనలో ఆప్యాయత కానీ లేవు. ఆమె ముఖంలోని అర్థంకాని ఆందోళననీ, ఆమె నడకలోని తడబాటునీ ఆమె వడ్డనలోని తప్పిదాన్నీ ఆనందరావు అత్తగారి ఇంటి దగ్గర కొత్తగా భోజనం చేస్తూన్నట్టు వంచిన తల ఎత్తకుండా, మారు మాట్లాడకుండా భోజనం చేయటం ఆనందరావు మనస్సును కాస్తపట్టి విడిచింది. స్నేహితునితో అకస్మాత్తుగా సహజ వాతావరణంలో ఏర్పడ్డ మార్పులకు కారణాల్ని వెతికేందుకు ప్రయత్నించ నారంభించాడు.

ఆ రాత్రి వరండాలో స్నేహితు లిద్దరూ పడుకున్నారు. ప్రొద్దు పోయేవరకూ కబుర్లు చెప్పుకున్నారు. కాని రమణరావు సంభాషణ్లో ఏం ఉత్సాహం కనబర్చలేదు. అతను క్షణక్షణానికి 'తను ఎందుకు ఇక్కడికి వచ్చాడు?'. అనే ప్రశ్నను సమాధానం చెప్పుకోలేక సతమత మవుతూన్నట్టు అగపడుతూంది. కాని స్నేహితునిలోని ఆ రకమైన మార్పును ఇంకా ఆనందరావు గుర్తించలేదు. అది గుర్తించిన క్షణాన పరిస్థితులు ఎలా మారతాయో!

మరునాడు ఉదయం టిఫిన్ తిని కాఫీ తాగి, వక్క పలుకులు నోట్లో వేసుకొని, గోల్డు ఫ్లేక్ సిగరెట్ వెలిగించుకుంటూ టవున్‌లోకి వెళ్ళారు మిత్రు లిద్దరూ. టవున్‌లోని కొన్ని ముఖ్యమైన ప్రదేశాలకు వెళ్ళి, క్లబ్బులో ఒక అరగంట క్యారమ్స్, ఒక అరగంట 'ఛెస్' ఆటలు ఆడి పదిన్నరకు ఇంటికి వొచ్చారు.

ఇంటికి వొచ్చేప్పటికి ఇంటినిండా జనం ప్రోగయి వుండడాన్ని చూసి స్నేహితు లిద్దరూ విస్మయులైనారు.

'ఏమిటి? ఏం జరిగింది?' అంటూ ఒక్క గంతులో ఇంటిలో జొరబడ్డాడు ఆనందరావు.

సావిత్రి మంచం మీద పడుకోబెట్టబడి ఉంది. డాక్టరు ప్రక్కన కుర్చీలో కూర్చున్నాడు. చుట్టూ ఇరుగూ పొరుగూ ఇళ్ళ బాపతు మనుష్యులు ఆడవాళ్లు కాక, మగవాళ్ళు కానీ, పిల్లలు కానీ ఒక ఇరవైమంది ఉన్నారు.

'ఏం జరిగిందండీ?...' ఆనందరావు గొంతు భార్య స్థితిచూడగానే గాద్గదికమైంది.

'సావిత్రి బావిలో పడింది...చప్పుడు విని మేమొచ్చి తీసి, నీళ్లు కక్కించాం. డాక్టరు గారికి కబురంపితే, చిటికెల మీద వొచ్చారు'. ప్రక్క ఇంటి నరసయ్య అన్నాడు.

'పాపం... ఏం కష్ట మొచ్చిందో! ఇంటిలో మగవాడు లేనప్పుడు అఘాయిత్యానికి పాల్పడింది ..' అన్న దొక యిల్లాలు.

'ఛీ, ఆ యమ్మగారి కేం కష్టం? చిలకా గోరింకల్లాంటి సంసారం. కాలు జారేమన్నా బావిలో పడిందేమో...' అన్నది ఇంకొక ఇల్లాలు.

ఆ అభిప్రాయాలను ఆనందరావు విన్నాడు. రమణరావు చెవిన కూడా బడింది సావిత్రి బావిలో పడినవార్త.

'సావిత్రి ఎంత పని చేసింది?' అనుకున్నాడు రమణరావు.

సావిత్రి బావిలో ఎందుకు పడింది? ఎట్లా పడింది? కాలు జారి పడిందా? పడవల్సే పడిందా? కాలుజారి పడటానికి ఆమె బావిదగ్గరకు ఎందుకు వెడుతుంది? బావిలో నీళ్లు తోడవలసిన గతి ఆమె కేంపట్టింది? పని మనిషి ఉందిగా! – బావిలో పడవల్సి – ఎందుకు పడుతుంది సావిత్రి? ఆమెకు వచ్చిన కష్టం ఏముంది? తను ఏమీ అనలేదే! తన రహస్యం తెలిసిందేమో ..! ఎవరు చెప్పారు? తెలిస్తే మట్టుకు బావిలో దూకి ఆత్మహత్య చేసికోవాల్సిన అగత్యం ఏం పట్టింది? ఆనందరావు ఏ విధంగానూ ఊహించుకోలేక పోతున్నాడు.

సావిత్రి తన వల్లనే ఆత్మహత్యకు తలపడింది. అసలు తను ఇక్కడకు రాకుండా ఉంటే ఎంత బాగుండేది? అయినా ... తనకేం తెలుసు

ఆనందరావు ద్వితీయ కళత్రం సావిత్రియే నని! .. తను ఇంకా ఈ ఇంట్లో ఉండరాదు! ఉంటే పరిస్థితులు ఒక రూపాన ఉండవు. సావిత్రి తన బ్రతుకు విలువకు సంబంధించి ఉన్న రహస్యాన్ని భర్తకు తెలియజేశాన నే భయంకొద్దీ - ఇంతకంటె దారుణమైన సాహసాలకు పూనుకో వొచ్చు. తను ఎట్లాగైనా సరే - ఈ కొంప లోంచి బయట పడడం ఉత్తమం! సావిత్రి భావిలో ఎందుకు పడిందని ఆనందరావు తనను ప్రశ్నిస్తే-తను ఏం జవాబు చెబుతాడు? ... అసలు ఆనందరావు ఆ ప్రశ్న తనని ఎందుకు వేస్తాడు? అది అతనికీ, అతని పరిసరాలకీ, అతని ఆంతర్యానికీ, సంబంధించింది! ... సావిత్రి తనకు తెలిసినట్లు ఆనందరావుకు తెలీదుగా!

డాక్టరు ఇంజెక్షన్ ఇచ్చి వెళ్ళాక సావిత్రికి స్పృహ వొచ్చింది. ఆమె భర్తవంక అతి పేలవంగానూ, తాను చేసిన దుష్కృత్యానికీ, దుస్సాహసానికీ పశ్చాత్తాప పడుతూన్నట్లుగానూ చూసింది. రమణరావు కొంచెం దూరంగా ఉండి ఆమె వంక చూశాడు.

'ఆరోగ్యం ఎలా వుంది?' అన్నాడు ఆనందరావు.

ఫర్వాలేదన్నట్టు తల ఆడించింది సావిత్రి.

'బావిలో దూకి ఆత్మహత్యచేసుకొ నేందుకు ఎందుకు ప్రయత్నించావు? అంత గతి నీకేం పట్టింది? అని అడగలేదు ఆనందరావు భార్యను. కనీసం వ్యంగ్యంగానైనా 'కాలుజారి పడ్డావా?' అనికూడా పరామర్శించలేదు. ఆ విషయాల్ని అతను సమగ్రంగా భార్యకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరిన తరువాత నే చర్చించ దల్చుకున్నాడు.

ఆ రోజు సాయంకాలానికి సావిత్రి ఆరోగ్యం చాలభాగం సుముఖంగా నే ఉంది. బాగా మాట్లాడగలుగు తూంది. రెండుసార్లు వేడి కాఫీ కూడా సేవించింది. రమణరావు ఆమెకు ముఖాన్ని చూపించలేదు. బయట వరండాలో కూర్చుని ఆలోచనలతో ప్రొద్దు పుచ్చుకుంటున్నాడు. ఆనందరావుకు భార్య మంచందగ్గర కూర్చోవడంతో సరిపోయింది.

ఆ రోజు రాత్రి ఆనందరావు భార్య మంచం దగ్గరే కూర్చుని ఉన్నాడు. రమణరావు బయట పడుకొని ఉన్నాడు. అర్ధరాత్రి ఒకసారి

సావిత్రికి మెలకువ వొచ్చింది. గదిలో దీపం వెలుగుతోంది. భర్త తన మంచం దగ్గరే కూర్చుని ఉండటాన్ని చూసి ఆమెకు ఎక్కడలేని దుఃఖమూ జాలీ, ప్రేమా పెల్లుబికి వొచ్చాయి. భర్త జుత్తులోకి వేళ్లు పోనిచ్చి –

'నా ఆరోగ్యం కోసం ఎంత శ్రద్ధగా కాపలా కాస్తున్నారు! నాకు ఆరోగ్యం బాగుంది. ఇక పడుకోరూ ?' అన్నది సావిత్రి.

అప్పుడు ఆనందరావు కన్ను మూశాడు. మరునాడు ఉదయం లేచి చూసేసరికి రమణరావు బయట లేడు. ఆ తెల్లవారు ఝామున రైలుకే తన ఊరు వెళ్ళాడు.

ఆనందరావు ఆశ్చర్య పడ్డాడు.

సావిత్రి మాత్రం ఆశ్చర్యపడలేదు.

*   *   *

మూడు రోజుల తరువాత ఆనందరావుకు రమణరావు దగ్గర్నుంచి ఉత్తరం వొచ్చింది. ఆ ఉత్తరంలో ఇలా ఉంది :

'మిత్రమా! అకస్మాత్తుగా నేను అదృశ్యం కావడం నీకు మితి మీరిన ఆశ్చర్యాన్ని కలిగించి ఉంటుందని అనుకుంటాను. నీకు చెప్పడం ద్వారా నేను త్వరగా బయట పడలేనని నమ్మటంచేత అట్లా చేయవలసి వొచ్చింది. క్షమించు.

'నీ ఆతిథ్యం రుచించక నేను చెప్పకుండా పారిపోయి వొచ్చానని అనుకుంటావేమో! అట్లా ఎన్నటికీ కాదు. కాని నేను నీ ఇంటిలో ఉండడంచేత పరిస్థితులు ఇంకా విషమిస్తాయని తలంచి వెంటనే వొచ్చాను.

'మొదటిలో నాకు నువ్వు ఉత్తరం రాస్తూ 'నాకు ఒకసారి వివాహమై భార్య క్షయ జబ్బుతో చనిపోతే మళ్ళీ పెళ్ళి చేసుకుంటూన్నట్టు ఆమెకు తెలియ నివ్వలేదు.' అని వ్రాశావు. ఆమెనూ, ఆమె తల్లిదండ్రుల్నీ ఆ విషయంలో మోసగించి, జయం పొందినట్టు సంతోషపడుతున్నావు. సావిత్రిని చూడగానే నీ అవివేకానికి నాకు నవ్వు వొచ్చింది.

'సావిత్రికి ఇదివరకే ఒకసారి పెళ్ళి అయింది. ఆమె భర్త నాకు ఆంతరంగిక మిత్రుడు. సావిత్రి అతనితో రెండేళ్లు కాపురం చేసింది.

ఆమె భర్త తెనాల్లో ఉద్యోగం చేస్తూ క్షయ వ్యాధితోనే మరణించాడు. ఈ రహస్యం నీకు తెలియనివ్వకుండా ఆమెను నీకిచ్చి పెళ్ళి చేయడంలో ఎవరు తెలివైనవాళ్లు? నువ్వు వాళ్లని మోసం చేశానని – సంతోషపడు తున్నావ్. వాళ్లూ అలాగే సంతోషపడుతూ ఉండాలి.

'సావిత్రి నన్ను చూడటంతో – ఆమె బ్రతుకును గురించి ఉన్న రహస్యాన్ని నీకు చెప్పానన్న భయంతో ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రయత్నించింది. ఆమె ఆత్మహత్యా ప్రయత్నానికి నారాకే కారణం.

'మిత్రమా! అయిందేదో అయిపోయింది. ఇంకొకర్ని మోసం చేయబోయి నీకు నీవుగానే మోసగించబడ్డావు. తగిన శాస్తి అని పశ్చాత్తాప పడి వూరుకో.

'ఇద్దరూ తమ బ్రతుకుల తాలూకు రహస్యాల్ని తెలుసుకున్నారు. హృదయాల్ని నిర్మలం చేసుకోండి. జీవితంలో అనుభవించగలిగినంత సుఖాన్ని అనుభవించండి.

'సావిత్రి మంచిపిల్ల. నేను రోజూ ఆమె ఇంటికి వెడుతూ ఉండేవాడ్ని. ఆమె సంసారాన్ని చక్కగా దిద్దుకోగల సమర్థురాలు దాంపత్యంలో నీకు తగిన స్త్రీ. ఆమె హృదయం చాల సున్నితమైంది. భర్తనే దైవముగా యెంచుకొనే స్వభావంగల స్త్రీ. నువ్వు మాటి మాటికీ జీవితంలో దైవికంగా జరిగిన పొరబాటును ఆమెకు తెలియజేస్తూ దాంపత్యాన్ని నరకం చేసుకోవటం భావ్యం కాదు. భార్య చనిపోతే నీకు ద్వితీయ వివాహాన్ని చేసుకొనే హక్కు ఎట్లా ఉందో—భర్త చనిపోతే ఆమెకు మాత్రం ద్వితీయ వివాహాన్ని చేసికొనే హక్కు లేదూ!

మీ దాంపత్యం ఆదర్శవంతంగా వర్ధిల్లు గాత!

— రమణరావు.

(జ్యోతి)

—o—